www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 జూన్ 2025



తిరుపతి జిల్లా పరిశ్రమల జీఎంకు సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాపరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గానూతనంగా నియమించిన చంద్రశేఖర్‌ను డిస్ట్రిక్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కెవి చౌదరి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన ఛాంబర్లో కలిసి సన్మానించారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేసేందుకు, ముఖ్యంగా ఎంఎస్ఎంఇల అభివృద్ధికి తమ వంతు సహకారం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కె. రఘురామి రెడ్డి, పి. మధుసూదన్ రావు, హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో...

మోడీ మతోన్మాద పాలన తిప్పికొడదాం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఎమర్జెన్సీ నిర్బంధంపై మాట్లాడుతున్న సిపిఎం నేత డి.రమాదేవి

కేంద్రంలోని మోడీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని సిపిఎం కేంద్రకమిటి సభ్యురాలు డి.రమాదేవి ఉద్ఘాటించారు. నేడు మతోన్మాద బిజెపి దుష్ట పాలనను తిప్పికొట్టడమే 50 యేళ్ల ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం మనకిచ్చే స్ఫూర్తి అని వక్తలు పేర్కొన్నారు.. సరిగ్గా జూన్ 25 నాటికి యాభై సంవత్సరాల క్రితం దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిన నేపథ్యంలో 'నాడు ప్రకటిత ఎమర్జెన్సీ..నేడు అప్రకటిత ఎమర్జెన్సీ' సదస్సు బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డి.రమాదేవి, ఎమర్జెన్సీ సమయంలో తిరుపతి జిల్లాలో అరెస్టయిన ప్రముఖ రచయిత శైలకుమార్, సీనియర్ పాత్రికేయులు రాఘవ మాట్లాడుతూ నాటి ఎమర్జెన్సీ రోజున అర్ధరాత్రి దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను, కార్యకర్తలను లక్షా 13వేల మందిని ప్రభుత్వం అరెస్టు చేసిందని, ఇందులో కార్మిక యూనియన్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి నాయకులే ఎక్కువగా ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని హెచ్ఎంటి, ఇసిఐఎల్, ఐడిపిఎల్, పబ్లిక్ సెక్టార్లలోని నాయకులు అనేకమంది అరెస్టయ్యారన్నారు. వాస్తవానికి నాడు కార్మికులు, విద్యార్థులు, వామపక్షవాదులే ప్రధాన ప్రతిఘటనదారులన్నారు. యాభైఏళ్ల అనంతరం ఎమర్జెన్సీ చీకటిపాలన గుర్తు చేసుకుంటే, అంతకంటే మరింత ప్రమాదకరమైన పరిస్థితి నేడు కార్పొరేట్ మతోన్మాద పాలనలో నిర్బంధాన్ని ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాను యుఎపిఎ చట్టం కింద ఎలాంటి విచారణ లేకుండా పదేళ్లు జైలు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారన్నారు. బ్రిటీష్ పాలనలో రాజద్రోహ నేరం కింద మూడేళ్ల కంటే ఎక్కువ కాలం విచారణ లేకుండా నిర్బంధించడానికి వీల్లేదని, నేడు బిజెపి పాలనలో పదేళ్ల విచారణ లేకుండా నిర్బంధించే పరిస్థితి దాపురించిందన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకాశ్మీర్, లడక్‌లలో ప్రజాస్వామ్యం మృగ్యమయ్యిందన్నారు. 1926 బ్రిటీషు కాలంలో పోరాడి సాధించుకున్న సమ్మె హక్కు చట్టాన్ని లేబర్ కోడ్‌ల పేరుతో అత్యంత నిరంకుశంగా రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, టి. సుబ్రమణ్యం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సాయిలక్ష్మి, ఆర్. లక్ష్మి, కె. వేణుగోపాల్, ఎన్. మాధవ్, చిన్న, బుజ్జి, జి.బాలసుబ్రహ్మణ్యం, రాజు, రమేష్, నరేంద్ర, జయంతి, టి. దామోదరం, ఓ. వెంకటరమణ, ఆప్ నాయకులు నగేష్, జన విజ్ఞాన వేదిక నాయకులు రెడ్డెప్ప పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : డి.రమాదేవి

తిరుపతి టౌన్ : స్కావెంజర్స్ కాలనీలోని పిహెచ్‌సిలో మౌలిక సదుపాయాలు కల్పించి, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం కేంద్రకమిటి సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్‌చేశారు. లీలామహల్ పక్కన ఉన్న స్కావెంజర్స్ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె సిపిఎం బృందంతో కలిసి పరిశీలించారు. ఆస్పత్రిలో శుభ్రత లేదని, పారిశుధ్య కార్మికురాలు చనిపోతే, నాలుగు నెలలైనా నియమించలేదన్నారు. అక్కడ ఉన్న ఎఎన్ఎంలు, డాక్టర్లు, ల్యాబ్ అసిస్టెంట్లు పారిశుధ్య పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇన్‌పేషంట్లకు సౌకర్యం లేదన్నారు. ఇద్దరు డాక్టర్లు ఉండాల్సిన చోట ఒక డాక్టరే ఉన్నారన్నారు. బిపి పరీక్ష చేయాలన్నా మిషన్ పాడైపోయిందన్న సాకుతో టెస్ట్ చేసే పరిస్థితి లేదన్నారు. కనీసం ఆస్పత్రుల్లో పరికరాలు బాగు చేసుకోలేని పరిస్థితిలో ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. ల్యాబ్ పరీక్షలకు టెక్నీషియన్ల కొరత ఉందన్నారు. డిఎంహెచ్ఓ జోక్యం చేసుకుని స్కావెంజర్స్ కాలనీలోని ప్రాథమిక ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, పి.సాయిలక్ష్మి, పి.బుజ్జి, ఎం.బుజ్జి, ఎం.నరేంద్ర, ఎం.జయంతి, ఎం.రాజు పాల్గొన్నారు.

స్కావెంజర్స్ కాలనీ పిహెచ్‌సిలో డి.రమాదేవి పరిశీలన

'పాడె' మోత.. పడతా లేస్తా..!

●పంట పొలాల్లో వెళ్లాల్సిందే..● కల్లిపూడిలో శ్మశానానికి దారేది..?

ప్రజాశక్తి - తొట్టంబేడు

పంట పొలాల మీదుగా అంతిమయాత్ర సాగిస్తూ...

మనిషి పుట్టుక నుండి మరణించే వరకూ జీవన పోరాటం చేస్తూనే ఉన్నాడు. ఆ ఊళ్లో మనిషి పోతే కుటుంబీకులకు, బంధుమిత్రులకు నరకమే. భౌతికకాయాన్ని స్మశానానికి తీసుకుని పోయే లోపు వారి బంధుమిత్రులకు చచ్చేంత పని అవుతుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి దళితవాడలో మంగళవారం రాత్రి కొప్పల వెంకటమ్మ (80) మతి చెందారు. ఈ గ్రామంలో ఎవరైనా చనిపోతే స్మశాన వాటికకు వెళ్లాలంటే పంట పొలాల మధ్య నడుచుకుంటూ వెళ్లాలి. ఇక్కడ దాకా పరిస్థితి ఒకరకంగా ఉంటుంది. పంట పొలాలను దాటిన తర్వాతే అసలు సమస్య మొదలవుతుంది. స్మశాన వాటికకు పోయే మార్గంలో తెలుగు గంగ కాలువ మీద నిర్మించిన సన్నపాటి బ్రిడ్జి మీదుగా భౌతిక కాయాన్ని తీసుకొని పోవాలి. ఈ బ్రిడ్జి నిర్మించి చాలా సంవత్సరాలు గడుస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. స్మశానంలో కూడా మౌలిక వసతులు కూడా సరిగా లేవని గ్రామస్తుల నుంచి వినిపిస్తున్న మాట. శవయాత్రలో పాల్గొన్న బంధుమిత్రులు సేద తీరటానికి ఒక చిన్నపాటి గది నిర్మించాలని, అలాగే స్మశాన వాటిక ఆవరణలో విష సర్పాలు చేరకుండా ఆ ప్రాంతంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

దారి సమస్య వాస్తవమే : సురేంద్రనాథ్, ఎంపిడిఒ

ఈ విషయమై ఎంపీడీవో సురేంద్రనాథ్‌ను వివరణ కోరగా కల్లిపూడి గ్రామంలో స్మశానానికి పోయే మార్గంలో సమస్య ఉన్న విషయం వాస్తవమే. ఈ దారి విషయం రెవిన్యూ శాఖకు సంబంధించింది. తెలుగు గంగ కాలువ మీద ఉన్న బ్రిడ్జిని నూతనంగా నిర్మించడానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గత మాసం మే నెలలో భూమి పూజ చేశారు. అలాగే స్మశాన వాటికలో మౌలిక వసతుల కొరకు ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధుల ద్వారా తొందరలోనే చేపడతాం.

నేటి నుంచి స్విమ్స్ కార్మికుల రిలే దీక్ష

30 నుంచి నిరవధిక సమ్మెకు నిర్ణయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్ యాజమాన్యం తమ పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు, 28న జరిగే చర్చలలో సమస్యలు పరిష్కారం కాకుంటే ఎమర్జెన్సీ విధులు మినహా మిగిలిన అన్ని పనులు చేపట్టకుండా నిరవధిక సమ్మెకు సన్నద్ధం కావాలని స్విమ్స్ ఉద్యోగ కార్మిక సంఘాల సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. బుధవారం ఉదయం స్విమ్స్ ఆస్పత్రిలో యూనియన్ అధ్యక్షులు సూరిబాబు అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి మారిముత్తు తదితరులు ఆందోళన ప్రతిపాదనలను సభ్యుల ముందు ఉంచారు. కార్మికులు ఏకగ్రీవంగా ఆమోదించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఏడాదిన్నర కాలంగా యాజమాన్యం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తోందన్నారు. అనేకమార్లు ఒప్పందం జరిగినా అమలు చేయకపోవడం దారుణమన్నారు. కొందరిని కాంట్రాక్టు కార్మికులుగా, మరికొందరిని కార్పొరేషన్ ఉద్యోగులుగా వివక్ష చూపుతున్నారన్నారు. అందరినీ కార్పొరేషన్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మూడో తరగతి ఉద్యోగులందరికీ వేతనాలు పెంచి, వార్డుబాయ్‌లకు మాత్రం వేతనాలు పెంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, కార్యనిర్వాహక అధ్యక్షులు కే. వేణుగోపాల్, యూనియన్ నేతలు వేలు, గోపి, జనార్ధన్, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్ సురేష్ బాబు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి అర్బన్ తహసిల్దార్ సురేష్ బాబు బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మర్యాదపూరకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి అర్బన్ పరిధిలో శెట్టిపల్లి భూముల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో పాటు ప్రభుత్వ ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుకు తిరుపతి అర్బన్ లో ఉండే రెవిన్యూ సిబ్బంది కషి చేయాలని కోరారు. ఇక్కడ అర్బన్ తాసిల్దార్‌గా ఉన్న భాగ్యలక్ష్మి చిన్న గొట్టిగల్లుకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

భద్రత లేని బడి 'మాకొద్దు'

మా స్కూలు మాకు కావాలి / రోడ్డెక్కిన 'విలీన' స్కూళ్ల గ్రామస్తులు, విద్యార్థులు

ప్రజాశక్తి - ఏర్పేడు

పల్లంపేటలో రోడ్డెక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు

'ఎవరి అనుమతి తీసుకుని బడిని విలీనం చేశారు.. ఉన్నపళంగా ఊళ్లో బడి పోతే ఎక్కడికెళ్లి చదువుకోవాలి..కిలో మీటర్ల దూరంలోని బడికి చిన్నపిల్లలను ఎలా పంపించగలం.. ఒకవేళ ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు పూచీ.. భద్రత లేని బడి మాకొద్దు' అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు గళమెత్తారు.. ఏర్పేడు మండలం పల్లంపేట దళితవాడలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 40 సంవత్సరాలుగా ఉంది. ఈ బడిని ప్రభుత్వం విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో వెంకటగిరి – ఏర్పేడు ప్రధాన రహదారిపై విద్యార్థులు, తల్లిదండ్రులు ర్యాలీ చేపట్టారు.రోడ్డుపై బైఠాయించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ విలీనం అంటూ 60 మంది పిల్లలు చదువుతున్న ఈ పల్లంపేట స్కూలును కేవలం 32 మంది చదువుతున్న పల్లం స్కూలులో విలీనం చేయడం దారుణమన్నారు. 1985 నుంచి ఉన్న పల్లంపేట స్కూలు 3,4,5 తరగతులను తీసుకెళ్లి 3 కిలోమీటర్ల దూరంలో హైవే రోడ్డుపై ప్రయాణించి వెళ్లి చదువుకోవడం పిల్లల ప్రాణాలతో చెలగాటమని మండిపడ్డారు. గతంలో 'నాడు–నేడు' లో లక్షలు వెచ్చించి, అన్ని మౌలిక వసతులతో ఈ స్కూలును పునరుద్ధరించారని, ఎటువంటి మౌలిక వసతులు లేని పల్లం స్కూల్లో విలీనం చేయడం ఏంటని ప్రశ్నించారు. స్కూల్ డెవలప్మెంట్ ఇంచార్జ్ సంతకం, అనుమతి లేకుండా విలీనం చేయడం హేయమైన చర్యని అన్నారు. రెండు రోజుల క్రితమే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న బడుల విలీన ప్రక్రియను ఆపకపోతే పిల్లలు ప్రభుత్వ బడులు మాని ప్రైవేట్ స్కూల్ బాట పట్టే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు సెల్వరాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగయ్య, సిఐటియు మండల సహాయ కార్యదర్శి రాంబాబు, కెవిపిఎస్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు వెంకటాద్రి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మా ఊరి బడికే పంపిస్తాం : పల్లంపేట గ్రామస్తులు

3,4,5 తరగతుల విద్యార్థులు చిన్న పిల్లలు. బస్సుల్లో పంపాలంటే కష్టం అవుతుంది. మేము దగ్గరుండి తీసుకెళ్లాలంటే కూలి పనులు చేసుకునే వాళ్ళం. కావాలంటే మేమే స్థలాలు ఇప్పిస్తాం. మా గ్రామంలోని మా బడిని డెవలప్ చేయండి. కలెక్టర్, ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లాం కానీ సమాధానం లేదు. అందుకే ధర్నాలు చేపడుతున్నాం. ఎమ్మెల్యే గారు వెహికల్ పెడతామని చెప్పారు ఏమైనా యాక్సిడెంట్లు జరిగితే మా పిల్లలకి బాధ్యత ఎవరని అడుగుతున్నాం.

బయట బడికి పంపలేం : ఎండిపుత్తూరు తల్లిదండ్రులు

'మా గ్రామం ఎండిపుత్తూరులో 70 ఏళ్లుగా ప్రాథమిక పాఠశాల ఉంది. మోడల్ స్కూలు పేరుతో విలీనం అంటూ ఎండి పుత్తూరు ప్రాథమిక పాఠశాలను రాజులకండ్రిగ పాఠశాలలోవ ఇలీనం చేయడం ఏంటి' అంటూ గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ 32 మంది పిల్లలు ఉన్న ఎండి పుత్తూరు పాఠశాలను మూడు కిలోమీటర్ల దూరం నడచి వెళ్లాలంటే కష్టతరమైన పరిస్థితి. గ్రామపెద్ద చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పాపానాయుడుపేట నుంచి ముసలిపేడు వరకూ నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. విద్యార్థులకు ఎపుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు. మా ఊరి బడికే మా పిల్లల్ని పంపిస్తాం అని గ్రామస్తులు మోహనరామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సురేష్, ఈశ్వర్, సుబ్రమణ్యం ఆచారి, వాసు పాల్గొన్నారు.

రద్దీ రోడ్డులో ఎలా పంపగలం : మేర్లపాక గ్రామస్తులు

మేర్లపాక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మన్నసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలు విలీనం చేస్తున్నారు. మన్నసముద్రం పోవాలంటే జాతీయ రహదారి రోడ్డు దాటి వెళ్లాలి. నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. స్మశానాలు, గుంటలు, పెద్దచెరువు మార్గంలో వెళ్లాలంటే భయపడే పరిస్థితి.

నెర్నూరులోనూ 'బాయ్‌కాట్'

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు మండల పరిధిలోని నెర్నూరు గ్రామములోని ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8, తరగతులను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువెంగనాయపల్లి పాఠశాలకు తరలించవద్దు అని బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు కెవిపిఎస్ అడపాల ప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నపళంగా 47 మంది విద్యార్థులను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువెంగనాయపల్లి పాఠశాలకు మార్చడం ఏంటని ప్రశ్నించారు. అంతదూరం తమ పిల్లలు వెళ్లలేరని పాఠశాలలు ప్రారంభమైన జూన్ 12వ తేదీ నుండి ఆందోళన చేస్తున్నా అధికార యంత్రాంగంలో చీమకుట్టినట్లు లేదన్నారు. పాఠశాల ప్రాంగణం విద్యార్థులు లేక వెలవెల బోతూ తరగతి గదులలో ఖాళీ బెంచీలు, నోట్ బుక్స్, ఉపాధ్యాయులకు దర్శనమిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో పెట్టుకొని ఎక్కడ చదువుతున్న వాళ్లని అక్కడే చదువుకునేలా చూడాలన్నారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్ మెంట్ చైర్మన్ దాసరి మోహన్, నాయకులు బి.వి.రమణయ్య, పాముంజి మణి, ఆర్.శ్రీనివాసులు, ఏంబేటి చంద్రయ్య, కె.ధనమ్మ, ఎస్.నరసమ్మ, పి.లక్ష్మి దేవమ్మ, సి.హెచ్.రమేష్, డి.మల్లికార్జున, దాసరి శీనయ్య, పల్లం రాజు, బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రదం చేద్దాం : కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపడుతున్న సార్వత్రిక సమ్మెతో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడలు వంచి కార్మిక హక్కులను కాపాడుకుందామని అఖిలపక్ష సమావేశంలో కార్మిక సంఘాలు ఉద్ఘాటించాయి. బుధవారం తిరుపతి నారాయణపురంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. న్యూ డెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి పి.వెంకటరత్నం అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నగర కార్యదర్శి వేణు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు మాంగాటి గోపాల్‌రెడ్డి, ఎపి రైతుకూలి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు ఆర్.వెంకయ్య, సిపిఐ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎఐటియుసి నగర కార్యదర్శి ఎన్‌డి రవి, ఆప్ జిల్లా అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. కార్మికసంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి జులై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్‌కు ఊతమిచ్చేలా ఉన్నాయన్నారు. సమ్మె జయప్రదానికి రౌండ్‌టేబుల్ సమావేశాలు, స్కూటర్ ర్యాలీలు, కార్మిక సంఘాల సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు.

'మురుగునీటి శుద్ధి'ని పరిశీలించిన 'చెప్కో' బృందం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారం కొరకు డిల్లీ నుండి తిరుపతికి వచ్చిన కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య , పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (చెప్కో) అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్యతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అమత్ లో భాగంగా యుజిడి నెట్వర్క్ ప్రధాన పైప్ లైన్ మెయిన్ లైన్ సమస్యలను పరిష్కరించేందుకు చెప్కో విభాగం అడ్వైజరీ కమిటీ సభ్యులైన చౌరాసియా, అమిత్ లు తిరుపతికి చేరుకున్నారు. బుధవారం ఉదయం భూగర్భ డ్రైనేజి యుజిడి నెట్వర్క్ ప్రధాన సమస్యగా ఉన్న రేణిగుంట రోడ్డులో భూమిలోకి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రధాన పైప్ లైన్ చాలా కాలం క్రితం ఏర్పాటు చేశారని, ప్రధానంగా ఉన్న సమస్యలను, తదితర విషయాలను కమిషనర్ అడ్వైజరీ కమిటీ బందానికి వివరించారు. అనంతరం సభ్యులు నెట్వర్క్ ప్రాబ్లం ఉన్న అన్ని ప్రాంతాల్లో పరిశీలించి సమస్య పరిష్కారం కొరకు చేయాల్సిన ఏర్పాట్లపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. అలాగే తూకివాకం వద్ద నున్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. నగరం నుండి మురుగునీరు వస్తున్న విధానం, శుద్ధి చేయడం, పరీక్షలు చేసిన అనంతరం నీటిని తిరిగి వినియోగించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ మురుగునీటి శుద్ధి విధానాన్ని ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. ఇక్కడ శుద్ధి చేసిన నీటిని రెండు విధాలుగా వినియోగిస్తామని తెలిపారు. శుద్ధి చేసిన నీటిని కొంత భాగం ల్యాంకో ఫాక్టరీ కి, కొంత నీటిని చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములకు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రైతులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. మురుగునీటి శుద్ధి విధానం బాగుందని ఈ మొత్తం విధానాన్ని డాక్యుమెంట్ రూపంలో రూపొందించాలని అధికారులకు సూచించారు. అడ్వైజరీ కమిటీ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ. రమణ, ఏ.ఈ. శిల్ప, మస్తాన్, తదితరులు ఉన్నారు.

స్మార్ట్‌సిటీ పనుల్లో పురోగతి ఉండాలి : కలెక్టర్

స్మార్ట్‌సిటీకి మంజూరైన పనుల్లో పురోగతి ఉండాలని స్మార్ట్‌సిటీ ఛైర్మన్, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్‌సిటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల 39వ సమావేశాన్ని ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. పురోగతిలో ఉన్న 14 పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం నిధుల కొరత ఉన్నందున వీలైనంత మేరకు కార్పొరేషన్ నిధుల నుంచి కొంత కేటాయించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎండి ఎం.మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

కాలు పోయినా..కనికరం లేదు..

● పింఛన్ ...ఏడి'పించెన్' ● ఏడాదిగా లబ్ధిదారుల నిరీక్షణ

ప్రజాశక్తి - కెవిబిపురం

కాలు లేదని స్పష్టంగా కళ్లముందు కనిపిస్తున్నా..

పక్క చిత్రంలోని వ్యక్తి పేరు బాలాజీ (20). కెవిబిపురం మండలం ఎస్ఎల్ పురం గిరిజన కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో ఓ కాలు పూర్తిగా పోయింది. కాలు లేని విషయం కళ్లెదుటే కనిపిస్తోంది.. అయినా అధికార యంత్రాంగంలోనూ, కూటమి ప్రభుత్వంలోనూ కనికరం లేదు.. నిరుపేద కుటుంబం.. ఏ పని చేయలేడు. ఏడాదిగా ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌కోసం నిరీక్షిస్తున్నాడు. పింఛన్ రూపంలో ప్రభుత్వ సాయం అందితే కనీసం తన ఖర్చులకైనా ఇంటి వాళ్లపై ఆధారపడే పరిస్థితి ఉండదని, చేతికి అంది వచ్చిన కొడుకును ఇంటిని చూసుకోవాల్సి ఉందని, అయితే తానే కుటుంబంపై ఆధారపడే పరిస్థితి నెలకొందని 'ప్రజాశక్తి'తో వాపోయాడు.

ఆమె పేరు తుపాకుల ధనమ్మ.. కెవిబిపురం మండలం దిగువ పుత్తూరు గిరిజన కాలనీ వాసి. 2023, ఏప్రిల్ నెలలో భర్తను కోల్పోయింది. అప్పటినుంచి వితంతు పింఛన్ కోసం ఎదురుచూస్తూనే ఉంది. 2024, జనవరి వరకూ వైసిపి నాయకులు అదిగో ఇదిగో అంటూ నెట్టుకొచ్చారు. తరువాత ఎన్నికల కోడ్ అని జూన్‌లో ఎగ్గొట్టారు. తరువాత కూటమి ప్రభుత్వం వచ్చింది. ప్రభుత్వం మారినా పింఛన్ దరఖాస్తులను ఇంతవరకూ స్వీకరించలేదు. దీంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉందని కంట తడిపెట్టుకుంది. అదే కాలనీలో మంగమ్మ (60) కూడా వృద్ధాప్య పింఛన్ కోసం ఎదురుచూస్తోంది. వయస్సు పైబడి ఉపాధి పనులకు, వ్యవసాయ కూలి పనులకు వెళ్లలేకపోతున్నానని, దరఖాస్తుకు అవసరమైన ధృవీకరణ పత్రాలను జతపరచి ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్వీకరించడం లేదని వాపోయింది.

ఈ ఆవేదన అంతా ధనమ్మ, లక్ష్మమ్మ, బాలాజీ సమస్య మాత్రమే కాదు. మండలంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, డప్పుకళాకారులు, చేనేత కల్లుగీత కార్మికుల ఆవేదన. మండలంలో 15 కేటగిరీల్లో 6,964 మందికి సామాజిక పింఛన్ అందుతోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా పింఛన్లను మంజూరు చేయకపోవడంతో అర్హులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూన్ నెలల్లో కొత్త పింఛన్లను మంజూరు చేసేవారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త పింఛన్ల మంజూరుకు నోచుకోలేదు. పింఛన్ల దరఖాస్తుకు వెబ్‌సైట్ తెరచుకోవడం లేదని వాపోతున్నారు. కనీసం ఎప్పుడిస్తారనేది కూటమి నేతలు చెప్పకపోవడంతో అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబానికి భారంగా ఎలా పడి ఉండాలని? మండిపడుతున్నారు.

రేవంత్ న్యూరోలో... పక్షవాతం 'కేర్'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పక్షవాతం ఒక అత్యవసర స్థితి అని, పక్షవాతం వచ్చిన రోగి మూడు గంటల్లో న్యూరాలజిస్టును సంప్రదిస్తే పక్షవాతాన్ని పూర్తిగా నయం చేసే అవకాశాలు ఉన్నాయని ప్రముఖ మెదడు, వెన్నుపూస, నరాల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.రేవంత్ రెడ్డి తెలిపారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీ లోని రేవంత్ న్యూరో కేర్ హాస్పిటల్ నందు డాక్టర్ రేవంత్ రెడ్డిని 'ప్రజాశక్తి' సంప్రదించగా పలు విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

పక్షవాతం మొదటి మూడు గంటల్లో నయం చేయాలంటే అందుకు తగిన లక్షణాలను మొదట్లోనే గుర్తించడం చాలా ముఖ్యం. ఉన్నట్టుండి మాట తడబడినా, మూతి వంకర పోయినా, ఒక వైపు చెయ్యి కాలు రాకుండా తిమ్మిర్లు పట్టినట్లు అనిపించినా, ఉన్నట్టుండి చూపు కనపడకుండా పోయిన, నడవడంలో బ్యాలెన్స్ తప్పిన పక్షవాతం వచ్చిందని గుర్తించాలి. ఈ లక్షణాలు కనిపించిన మొదటి మూడు గంటల్లో న్యూరాలజిస్ట్‌ను సంప్రదిస్తే వెంటనే మెదడును స్కాన్ చేసి రక్తపు గడ్డలు కరిగించే మందు ఇవ్వడం ద్వారా నయం చేయవచ్చు. మెదడులో ఒక భాగానికి ఉన్నట్టుండి రక్తప్రసరణ ఆగిపోతే పక్షవాతం వస్తుంది. సాధారణ ప్రజలతో పోలిస్తే మధుమేహం, రక్తపోటు ఉన్న వారిలో, ఊబకాయం ఉన్నవారిలో పక్షవాతం వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాగే వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉంది. మధుమేహం, రక్తపోటు అదుపులో ఉంచుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, వ్యాయామం, సరైన ఆహార నియమాలు పాటించడం ద్వారా పక్షవాతం రాకుండా చేసే అవకాశం ఉంది. పక్షవాతం వచ్చిన రోగులు చెయ్యి కాలు బాగా రావడానికి ఫిజియోథెరపీ చేసుకోవడం, డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడటం ద్వారా సాధారణ జీవనశైలిని తిరిగి పొందవచ్చు. నాటుమందులు, పసరుమందులుపై ప్రామాణిక పరీక్షలు జరగనందున శాస్త్ర సమ్మతం కాదు. రేవంత్ న్యూరో కేర్ హాస్పిటల్ లో అత్యాధునిక న్యూరాలజీ సేవలు ఇప్పుడు తిరుపతిలో అందుబాటులో ఉంది. సంప్రదించు నెంబరు 9912806086, 0877 2226086. ప్రత్యేక వైద్య చికిత్సలు: పక్షవాతం , మూర్ఛ వ్యాధి , మైగ్రేన్ తలనొప్పి, టెన్షన్ తలనొప్పి, అన్ని ఇతర రకాల తలనొప్పులు, నరములు, కండరాల బలహీనత, కాళ్ళు చేతులు తిమ్మిర్లు మంటలు, చక్కెర వ్యాధి సంబంధం నరాల జబ్బు, మెడ నడుము నరములు లాగుట, కళ్ళు తిరుగుట స్పృహ కోల్పోవటం, మూతి వంకర పోవుట, మెదడు వెన్నుపూస ఇన్ఫెక్షన్లు, చేతులు కాళ్లు వణుకుట , నిద్ర సమస్యలు, మయస్తీనియ గ్రేవిస్, మల్టిపుల్ స్క్లిరోసిస్, మోటార్ న్యూరాన్ వ్యాధి వంటి వాటికి ప్రత్యేకమైన అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

మొదటి మూడు గంటలు అమూల్యం

రోడ్డుపైనే మురుగునీరు.. రాకపోకలు సాగించేదెట్టా..?

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- స్థానికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : మున్సిపాల్టీ పరిధిలోని గేట్ పుత్తూరు ఆనంబట్టు రోడ్డులో వర్షం వస్తే మురుగు కాలువల నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మురుగునీటి ప్రవాహంలో ప్రజలు నడవాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. ఈ విషయంపై పలుసార్లు మున్సిపల్ శాఖ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆ రోడ్డుపై పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వారు వెళ్లాలంటే మురునీటి ప్రవాహం కారణంగా వెళ్లలేక పోతున్నారని పలువురు వాపోతు న్నారు. విద్యార్థులు పిల్లారి పట్టు వద్ద పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లాలంటే ఆ రోడ్డుపైనే వెళ్లాల్సి వుంది. కాలేజీ వదిలే సమయంలో ఆ రోడ్డుపై ఎలా వెళ్లాలో తెలియక పడరాని పాట్లు పడుతున్నారు. మోటార్ సైకిల్ పై వెళుతుంటే జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించు కున్నా మున్సిపల్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై మురికి నీరు రాకుండా అడ్డుకట్టలు లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట గేట్ పుత్తూరు ప్రజలు నిరసన చేపడుతామని హెచ్చరించారు.

రోడ్డుపైనే ఇబ్బందికరంగా ప్రవహిస్తున్న మురుగునీరు

పూడికతీత తీయాలి

డ్రైనేజీలలో పూడిక తీయక పోవడం వల్లే మురుగునీరు నిండి రోడ్డుపై ప్రవహిస్తోంది. మున్సిపల్ శాఖ వారికి ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదు.

- రఫీ, ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు.

వర్షం వస్తే నరకయాతన

వర్షం వస్తే నరకయాతన పడాల్సిందే.. విద్యార్థులు కళాశాల నుంచి రోడ్డుపై రావాలంటే చాలా ఇబ్బంది కరంగా ఉంది.. అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు..

-రామయ్య, ఆనంబట్టు రోడ్డు.

క్రైం న్యూస్

85 వాహనాలకు జరిమానా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో అలిపిరి వద్ద బుధవారం ద్విచక్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా రోడ్లపై ప్రయాణిస్తున్న 85 వాహన చోదకులకు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికానాజ్, ఆంజనేయ వర్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే ఇంటికే: ఎమ్మెల్యే

విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : హాస్టల్ విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఇంటికి పంపుతామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్ను పరిశీలించారు. విద్యార్థుల అవస్థలపై ఆరా తీశారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన ఆహారం అందించడంలో రాజీ పడొద్దన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని అయ్యవారిపాళెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్కుమార్ సహకారంతో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆ పాఠశాలలోని 65 మంది విద్యార్థులకు , మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ట్రైబల్ వెల్ఫేర్లోని 27 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మేగనూరు ఎంపిటిసి ఉమామహేశ్వరి , ఉమేంద్ర అయ్య వారి పాళెం టిడిపి నాయకులు నారాయణరెడ్డి , రవీంద్ర రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమార్ , ఉపాధ్యాయులు శేఖర్, చంద్రశేఖర్ , స్కూల్ మేనేజ్మెంట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ తిరుమల నగర్లో ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారిని బుధవారం చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని దర్శించు కున్నారు. ప్రతి ఏడు అమ్మవారి జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తిరుమల నగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపినాథ్, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ టిడిపి నాయకులు ఈశ్వరయ్య, మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, శ్రీనివాసులు, సాంబ, వెంకటేష్, సతీష్, నవీన్, పట్టాభి, సుధాకర్, సిపిఐ నాయకులు కేశారి రాధాకృష్ణ, హరికృష్ణ, ప్రముఖ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

ప్రజాశక్తి -పాకాల : జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, బందార్లపల్లి లో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న గుణశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వరరావు లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. రాజవేలు వారు చేసిన సేవలను విద్యార్థులకు అందించిన గొప్ప ఫలితాల గురించి వివరిస్తూ వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత విలువలతో విద్యను విద్యార్థులకు అందించి గొప్ప పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు నిర్మల్ కుమార్ ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, చిట్టిబాబు, ద్వారక నాథ్ రెడ్డి,కుమార్ రాజా,సురేష్ బాబు, రాధాకుమారి, రామచంద్రయ్య, వెంకటేశులు, సీఆర్పీవెంకట మునిరెడ్డి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

టీకాలు సంక్రమంగా వేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పగడాల పల్లి గ్రామం , మిట్టాత్మకూరు సచివాలయంలో చిన్న కత్తిరించేందుకు వచ్చిన కూలీల పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా? అని డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ మౌనిక, డాక్టర్ జ్యోతిల బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పలు సూచనలు , సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజరు మస్తానయ్య పాల్గొన్నారు.


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చందు

శివుని సన్నిధిలో గూగుల్ వైస్ ప్రెసిడెంట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఏఐ సాంకేతికతను అందించాలని గూగుల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ తోట చందును శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కోరారు. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి చందు బుధవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. రాహు-కేతు పూజలు, స్వామి అమ్మవార్ల దర్శనానంతరం చందుతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రత్యేకంగా కలిశారు. తిరుమలలో భక్తుల ఇబ్బంది పడకుండా టిటిడి ఏఐ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిందని, ఈ- మెషిన్ ట్రయల్ సైతం చెక్ చేశారని, విజయవంతమైతే త్వరలో ఆమోదం లభిస్తుందన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇదే టెక్నాలజీని శ్రీకాళహస్తీశ్వరాలయానికి కూడా అందించాలని ఎమ్మెల్యే కోరగా తప్పకుండా సాయపడతామని చందు హామీ ఇచ్చారు.

వసతి గృహాలపై ప్రభుత్వం చిన్నచూపు

బీసీవై అధినేత రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూపుతోందని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ విమర్శించారు. పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థుల కనీస బాగోగులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రామచంద్ర యాదవ్ బుధవారం పట్టణంలోని బీసీ హాస్టల్ను తనిఖీ చేశారు. విషాహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. హాస్టల్లోని పరిస్థితులను స్వయంగా పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

టాక్సీలకు స్థలాన్ని కేటాయించండి

ప్రజాశక్తి-నాయుడుపేట: పట్టణంలోని అంబేద్కర్ భవన్ ఎదురుగా ఉన్న ఆర్అండ్బి స్థలంలో టాక్సీలు ఆపుకొని బతుకుదెరువు కొనసాగిస్తున్న తమకు ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం తగదని ఈ స్థలాన్ని తమకు కేటాయించి బతుకుతెరువును కాపాడాలని టాక్సీ డ్రైవర్ల సంఘం నాయకులు మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ ఎస్కె పజిల్లుల్లాకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా టాక్సీ తోలుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లు నాయుడుపేట పంచాయతీగా ఉన్న సమయంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా చదలవాడ కాంప్లెక్స్ కట్టకముందు నుంచి అక్కడ టాక్సీలు ఆపుకునేవారని కాంప్లెక్స్ కట్టాలని స్థలం ఖాళీ చేయమనడంతో పక్కన ఉన్న ఆర్అండ్బి ఖాళీ స్థలంలో టాక్సీ స్టాండ్ పెట్టుకున్నారని ఈ క్రమంలోనే 2019 కు ముందు టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అన్నా క్యాంటీన్ ను ఏర్పాటు చేయడానికి ఆ స్థలంలో ఉన్న టాక్సీలను ఖాళీ చేయించి అంబేద్కర్ భవనం ఎదురు గా ఉన్న ఆర్ అండ్ బి స్థలంలో నిలుపుకునేందుకు అప్పటి పోలీసులు అనుమతించారని ఏడు ఏళ్లుగా అదే స్థలంలో టాక్సీలు ఆపుకొని జీవనం సాగిస్తున్న కార్మికులను వెళ్లగొట్టడం తగదని ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓగిరి, మస్తాన్ రెడ్డి, సిహెచ్ హేమంత్, వి రమణయ్య, ఎస్కే, అమీర్, చెంచు కృష్ణయ్య, జిలాని, సతీష్, మాధవ్ పాల్గొన్నారు.

కమిషనరుకు టాక్సీ డ్రైవర్ల సంఘం వినతి

మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం అందిస్తున్న టాక్సీ డ్రైవర్లు

ముగిసిన మహిళ సర్పంచుల శిక్షణ

శిక్షణలో పాల్గొన్న మహిళ సర్పంచులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో 'స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత–గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు'పై మహిళా సర్పంచ్లకు అందించిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర పరిశీలకులు ఎన్ ఐఆర్డి ప్రసాద్, గూడూరు డిఎల్డివో వాణిరెడ్డిలు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మహిళ సర్పంచ్లు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపిడిఓ మధుసూదనరావు, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ఏంఓటి ఎంపిడిఓ బ్రహ్మయ్య, గూడూరు, మనుబోలు, బాలయపల్లి, డక్కిలి, కోట, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి మండలాల మహిళా సర్పంచ్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : మాదకద్రవ్యాలకు దూరంగా వుండాలని మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టరు ఇ కోన ప్రభ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం, స్థానిక బాలాజీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం పై బుధవారం అవగాహనా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టరు ఇ కోన ప్రభ మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని, అవగాహనా లోపం, స్నేహితుల ప్రలోభాలు, చెడు స్నేహాలు, సరదా వంటి కారణాలతో చాలామంది యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు బానిసలవుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు, పౌరశాస్త్రం లెక్చరర్ చెన్నారెడ్డి , మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్స్ డాక్టరు ఎం ఇంద్రాణి, ప్రీతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- క్యాంపస్ : మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్. కె రాణి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు – వ్యసనాలు– వాటి నిర్మూలన ' అనే అంశం పై ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో వివిధ శాఖల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ జి ఎస్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై వివరించారు. డాక్టర్ కె రాణి మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ వివరించారు. మత్తు , మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా వుండాలని సూచించారు. చివరగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర్, నోడల్ ఆఫీసర్ సులోచన రాణి, మహిళా యూనివర్సిటీ అధ్యయన కేంద్రం డాక్టర్ ఎం ఇంద్రాణి, వి ప్రీతి ప్రాజెక్ట్ అసిస్టెంట్స్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వర్ యాదవ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని మండల ఐటీడీపీ అధ్యక్షులు, యూనిట్ ఇన్చార్జి ఈశ్వర్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో కేకును కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఘనంగా సన్మానించి ఆరోగ్యంగా వుండాలని ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్ ఎన్ ధనపాల్, ఏబాలాజీ, వెంకటేష్, కరుణ యాదవ్, బొబ్బిలి యాదవ్, చెంచయ్య, ఉమా శంకర్, హేమాద్రి, తదితరులు పాల్గొన్నారు.

దీపకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం పరిశోధకురాలు భీమచెర్ల దీపకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ సిఈ బి రాజమాణిక్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యావిభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ దయాకర్ రెడ్డి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ ఆటిట్యూడ్ ఆఫ్ సెకండరీ స్కూల్ టీచర్స్ టు వర్డ్స్ కంటిన్యూస్ అండ్ కాంప్రెహెన్సివ్ ఎవాల్యూషన్ ఇన్ రాయలసీమ రీజియన్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు భీమచర్ల దీపకు డాక్టరేట్ ప్రదానం చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన ఈమె ఎస్జిటిగా, పిజిటిగా, ప్రిన్సిపాల్ గా వివిధ ఉపాధ్యాయ వృత్తులను నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ వల్లూరులో వృక్షశాస్త్రం అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నందలూరు, తాళ్లపాక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టిటిడి అనుబంధంగా ఉన్న అన్నమయ్య జిల్లా నందలూరు, తాళ్లపాకలోని ఆలయాలలో నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం ఆదేశించారు. అధికారులతో కలిసి ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను నందలూరు, తాళ్లపాకలలో బుధవారం పరిశీలించారు. నందలూరులో జులై 5–13 తేదీల్లోనూ, తాళ్లపాకలో జులై 6–15 వరకూ వేడుకగా జరగనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇలు వెంకటేశ్వర్లు, మనోహరం, డిప్యూటీ ఈవోలు నటేష్బాబు, శివప్రసాద్, ప్రశాంతి, డిఎఫ్ఓ ఫణికుమార్నాయుడు పాల్గొన్నారు.

ఇరాన్పై దాడులు దుర్మార్గం: సిపిఎం

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: ఇరాన్పై అమెరికా దాడులు నిర్వహించడం దర్మార్గమని పశ్చిమ ఆసియాపై పెత్తనం చెలాయించేందుకేనని దీన్ని భారత్ వ్యతిరేకించాలని పుత్తూరు సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఇరాన్పై అమెరికా దాడులు నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి కష్టకాలంలో ఇరాన్ భారత్కు మద్దతు ఇస్తోందని, ప్రస్తుత ఆపద సమయంలో అమెరికా ఇజ్రాయిల్తో కలిసి ఇరాన్పై దాడి చేయడాన్ని భారత్ వ్యతిరేకించాలని కోరారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్పిటీ)పై ఇరాన్ సైతం సంతకం చేసిందని, అయినా ఆ దేశంపై అమెరికా దాడులు నిర్వహించడం పశ్చిమ ఆసియాపై పెత్తనం చెలాయించేందు కేనని, దీన్ని భారత్ వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏ విజయ్, యాషన్ భాష, మోసెస్ పాల్గొన్నారు.

త్వరలో రైతులకు సబ్సిడీ కిట్లు: ఎంఏవో

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రైతులకు త్వరలో సబ్సిడీ కిట్లు అందిస్తామని మండల వ్యవసాయాధికారి రమేష్ పేర్కొన్నారు. మండలంలోని వెడిచెర్ల, మంగళపూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది' ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రమేష్ మాట్లాడుతూ పచ్చి రొట్ట, పిఎండిఎస్ కిట్లను సబ్సిడీపై త్వరలో రైతులకు అందిస్తామని ఇవి భూసారం పెంపుదలకు ఎంతో తోడ్పడతాయన్నారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యాన అధికారిణి యన్ సునీత మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్ , స్ప్రింక్లెర్ లను రాయితీపై ఇస్తామని తెలిపారు. కొత్తగా నిమ్మ, మామిడి, బొప్పాయి పంటలు వేసుకునే రైతులకు మొక్కల ఖర్చు , వాటి నిర్వహణకు ఉద్యాన శాఖ సహకారం అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె శివ, రైతులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలంలోని తల్లంపాడు , లింగంపాడు గ్రామాలలో మావిళ్లపాడు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కె శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారిణి ఏ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో బుధవారం ' పొలం పిలుస్తోంది'ని నిర్వహించారు.ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం హెయస్ వాక్సినేషన్ పశువులకి వేస్తున్నామని తెలిపారు. వేయించని వారు పశువులకి వేయించాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ వరి పంటల్లో ప్రస్తుతం మైట్స్ ఎక్కువగా వుందని, అది ఉన్నచోట స్పిరోమెసెఫిన్ 22.9 శాతం ఎస్సి 160 ఎం.ఎల్ ఒక ఎకరానికి వాడాలని సూచించారు. మోముబిప్పికి కాటాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గవాస్కర్ వెటర్నరీ స్టాఫ్ రైతులు పాల్గొన్నారు.

కొప్పల వెంకటమ్మకు పలువురి నివాళి

ప్రజాశక్తి -తొట్టంబేడు : మండలంలోని తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి హరిజనవాడలో మంగళవారం రాత్రి సుపరిచితురాలు కొప్పల వెంకటమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం వైసిపి తొట్టంబేడు మండల అధ్యక్షులు కోగిల సుబ్రహ్మణ్యం ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టిడిపి నాయకులు శోభన్ బాబు నాయుడు వెంకటమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ఎవ్వరికి ఎలాంటి కష్టం వచ్చినా టిడిపి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన ముగ్గురు విద్యార్థులు కడప ట్రిపుల్ ఐటికి ఎంపికయినట్లు ప్రధాన ఆచార్యులు సత్యనారాయణ తెలిపారు. నారాయణవనం మండలం తుంబూరు గ్రామానికి చెందిన విద్యార్థి ఉదయ్కుమార్, వరదయ్యపాలెం చెందిన జశ్వంత్, శ్రీకాళహస్తికి చెందిన బెన్హర్బాబు ఉన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రధాన ఆచార్యులు సత్యనారాయణ అభినందించారు.

అన్ని 'బిజినెస్'లకు 'ట్యాలీ' ముఖ్యం

ప్రజాశక్తి - క్యాంపస్: అన్ని బిజినెస్ ఆర్గనైజేషన్లకు ట్యాలీ ముఖ్యమని ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో సావేరి సెమినార్ హాల్లో ఎంబిఎ విభాగంలో ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో 'ట్యాలీ ప్రైమ్' అంశంపై వర్కుషాపు నిర్వహించారు. ట్యాలీ ద్వారా అకౌంటింగ్ సులభతరమని, ట్యాలీలో జీఎస్టీని చేర్చడం వల్ల వాడుకకు చాలా సులభమని యూజర్ ఫ్రెండ్లీ అని తెలిపారు. వక్తగా విచ్చేసిన హిపోక్లాడ్ అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ ఫ్యాకల్టీ రాంబాబు మాట్లాడుతూ ట్యాలీ అనేది మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారయ్యిందన్నారు. ఒక ఈఆర్పీ సాఫ్ట్వేర్ ప్రపంచమని తెలిపారు.

అనధికార స్టిక్కర్లు వేసుకుంటే చర్యలు: సీఐ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వాహనాలపై అనధికార పోలీస్, ప్రెస్ స్టిక్కర్లు వేసుకుంటే చర్యలు తప్పవని టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. పట్టణంలో బుధవారం అనధికారికంగా ప్రెస్, పోలీసు స్టిక్కర్ వేసుకున్న వాహనదారుల పై శ్రీకాళహస్తి పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనధికారికంగా ప్రెస్, పోలీసు స్టిక్కర్లు వేసుకున్న ఐదు వాహనాలకు స్టిక్కర్లు తొలగించారు. మొదటి తప్పుగా హెచ్చరించి విడిచిపెట్టారు.

మాస్టర్స్ డిగ్రీ కోసం విట్ బెంగుళూరు ఎంఓయు: ప్రొఫెసర్ విరాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విదేశాలలో మాస్టర్స్ డిగ్రీ చేయాలనుకునే విద్యార్థులకు బెంగుళూరు విట్ బెంగళూరు ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ 1892లో స్థాపితమై లండన్ సౌత్ బ్యాంక్ విశ్వ విద్యాలయం(ఎల్ఎస్బియు)తో అంతర్జాతీయ భాగస్వామ్య ఒప్పందం చేసుకుందని, దీని ద్వారా విద్యార్థులు అధునాతన టెక్నాలజీతో కూడిన విద్యను అభ్యసించడానికి వీలవుతుందని విట్ బెంగళూరు గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ ఇంటర్నేషనల్ డిగ్రీస్ ప్రొఫెసర్ వి రాజు తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఒప్పందం ప్రకారం బీబీఏ, బీకాం, ఎంబీఏ, ఎంకామ్, గణితం, భౌతిక శాస్త్రాలు, కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ లేదా ఎమ్మెస్సీ, బీటెక్ చేసిన వారికి విట్ బెంగళూరులో ఏడాది పాటు కోర్సు పూర్తిచేసిన వారికి లండన్ లోని ఎల్ఎస్బియులో తమ మాస్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని పూర్తి చేయడానికి వీలు కల్పిస్తామన్నారు. యూకేలో ఎంతో పేరుగాంచిన ఈ విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బిజినెస్, అనలైజేషన్ వంటి కోర్సులు నేడు డిమాండ్ ఉన్నాయని, ఈ రంగాలలో నైపుణ్యతను అందిస్తూ, యూకే ఆధారిత మాస్టర్స్ డిగ్రీ వ్యవధిని 18 నెలల నుండి 12 నెలల వరకు తగ్గిస్తారన్నారు. దీని ద్వారా విదేశీ విద్య అభ్యసించాలని విద్యార్థులకు ఖర్చు తగ్గుతుందని, విశ్వవిద్యాలయం నుండి స్కాలర్షిప్ కూడా పొందుతారన్నారు. పోస్ట్ స్టడీ వర్క్ వల్ల గ్రాడ్యుయేట్లు అక్కడి యూకే ప్రభుత్వం పోస్ట్ స్టడీ వర్క్ పర్మిట్ కు అర్హత కల్పిస్తుందని, దీంతో పరిశ్రమకు సంబంధించి వృత్తి నైపుణ్యాలను పొందే అవకాశం ఉందన్నారు. విట్ బెంగుళూరు ద్వారా ఔత్సాహిక విద్యార్థులకు ఆన్లైన్ సమాచార సెషన్ను నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు హాజరుకావాలని కోరారు. మరింత సమాచారం కోసం 91 636 2906969 ను సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి: సీఐ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా గూడూరు అశోక్ నగర్ వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి వద్ద వన్ వే రూట్ అమలు చేస్తున్నామని ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని గూడూరు టూ టౌన్ సిఐ శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అశోక్ నగర్ వద్ద ఉన్న రైల్వే అండర్ బిడ్జి వద్ద నిరంతరం ట్రాఫిక్ సమస్య వస్తుందని దీని కోసం ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వన్ టౌన్ నుండి యధావిధిగా పాత అండర్ బ్రిడ్జి నుండి టూటౌన్కు రాకపోకలు సాగించ వచ్చన్నారు. చెన్నూరు, గాంధీనగర్ నుండి వచ్చే వాహనాలు మినీ బైపాస్ రెండో అండర్ బ్రిడ్జి ద్వారా ఒకటవ పట్టణంలోకి వస్తాయన్నారు. ట్రాఫిక్ సమస్యను నివారించే ఈ విధానానికి ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .

మామిడి రైతులను ఆదుకోవాలి: సీపీఎం

ప్రజాశక్తి -రామచంద్రపురం (పాకాల): మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దామలచెరువు మ్యాంగో నగర్ లో మామిడి మండీలను, ర్యాంపులను మండల సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ బృంద సభ్యులు రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు సిపిఎం బృందంతో మాట్లాడుతూ గత సంవత్సరం ఒక కేజీకి 25 రూపాయల నుంచి 75 రూపాయల వరకు ధర పలికిందని, అదే ఈ సంవత్సరం కేజీకి రెండు మూడు రూపాయలు ధర పలుకుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. తాము మామిడి పంటకు క్రిమిసంహారక మందులు, కాపు, కోత కూలీలు పెట్టుబడులు అన్నీ ఖర్చుపెట్టిన గిట్టుబాటు ధర రాలేదని ఏ రైతును పలకరించిన ఆవేదనకు గురవుతున్నారని ప్రభుత్వం రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర కేజీకి 12 రూపాయల తక్కువ కాకుండా ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్ రావు, నాయకులు ప్రసాద్, లక్ష్మయ్య, నరేంద్ర పాల్గొన్నారు.

సుభాషిణికి నివాళి

ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం పరిధిలోని చెర్లోపల్లి పంచాయతీకి చెందిన కాంట్రాక్టర్ బొల్లినేని శుభగిరి భార్య బొల్లినేని సుభాషిణి మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని వారితో కలిసి బొల్లినేని సుభాషిణి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవినింగ్ స్టడీ సెంటర్ ప్రారంభం

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -రేణిగుంట: పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో రేణిగుంటలోని ఆర్.సి.యం పాఠశాలలో బుధవారం సాయంత్రం పేద విద్యార్థుల సౌకర్యార్థం ఈవినింగ్ స్టడీ సెంటర్ ను ప్రారంభించారు. ముఖ్యఅతిథి రేణిగుంట సర్పంచ్ నగేషం చేతుల మీదుగా నోట్ బుక్స్, ప్యాడు, పెన్సిల్స్ లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మ మహిళా మండలి ప్రాజెక్ట్ ఆఫీసర్ జూలియన్ రాజు మాట్లాడుతూ ప్రైవేట్ ట్యూషన్ కు వెళ్లలేని పేద విద్యార్థులకు తమ వంతు సహాయంగా స్టడీ సెంటర్ ను ఏర్పాటు చేశామని అన్నారు.ప్రతిరోజు సాయంత్రం స్టడీ సెంటర్లో ఇద్దరు టీచర్లు ఉచితంగా విద్యను బోధిస్తారని తెలిపారు.పేద విద్యార్థుల చదువు కోసం తమ వంతు సహాయం చేసేందుకు ఎప్పుడు ముందుంటామని అన్నారు. సర్పంచ్ నగేషం మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ఈవినింగ్ స్టడీ సెంటర్ ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.విద్యార్థి దశలోనే పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సుమశ్రీ లక్ష్మి, శ్రీను, ఉపాధ్యాయులు శౌరి, చిన్నయ్య, తేజ పాల్గొన్నారు.

గోవింద ధామంలా దహన వాటిక ఏర్పాటు

మీడియాతో ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ ప్రస్తుతం మంగళం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉమ్మడి శ్మశాన వాటిక (హిందూ, ముస్లిం, క్రిస్టియన్స్) హద్దులను తేల్చి ప్రహరీల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం తిరుమల నగర్ లో ముత్యాలమ్మ అమ్మవారి జాతర కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో ముచ్చటించారు. బిటిఆర్ కాలనీకి, ఎన్బీఎన్ కాలనీకి, కృష్ణవేణి యాదవ్ కాలనీకి అనుకొని ఉన్న మూడు శ్మశానవాటికలకు సంబంధించి సర్వే నిర్వహించాలని తిరుపతి అర్బన్ మండల తహశీల్దార్ సురేష్ బాబుకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై పూడ్చివేతలో కాకుండా ఎల్పిజి ఆధారిత, విద్యుత్ ఆధారిత దహన సంస్కారాలు జరిగే విధంగా అన్ని ఏర్పాట్లను చేయనున్నట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గం మంగళం ప్రాంతాన్ని రానున్న జూలై మాసం నుండి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి సంకల్పించామని, ఇందులో భాగంగా శ్మశాన వాటికల అభివృద్ధి, తిరుమల నగర్ పంచాయతీలోని కేబిఆర్ నగర్ కు రోడ్డు మార్గం, సిసి రోడ్ల నిర్మాణం, సీసీ డ్రైవర్ నిర్మాణం ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు.

టిటిడి అదనపు ఈవో తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో వెంగమాంబ ధ్యానమందిరం అభివృద్ధి పనుల స్థలాన్ని, పలు ఫాస్ట్ఫుడ్ సెంటర్లను అదనపు ఈవో వెంకయ్య చౌదరి బుధవారం పరిశీలించారు. తిరుమలలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఆధ్యాత్మిక శోభ కలిగేలా సంప్రదాయ వంటకాలు అందిస్తున్నారు. టిటిడి ఆరోగ్య, పంచాయతీ అధికారులతో కలిసి ఫాస్ట్ఫుడ్ సెంటర్లకు పలు సూచనలు చేశారు.

IN THE COURT OF HON 'BLE XII -ADDL DISTRICT JUDGE: SRIKALAHASTHI
A.S. No. 8 OF 2024
(Against the Decree and Judgment) Made in O.S.No.60 OF 2017,
Civil Judge (Senior Division), Srikalahasthi.
Y. Sarojamma and others ...Appellants
Vs
Yathaluru Muthyalamma(died) and others ...Respondents
NOTICE TO RESPONDENTS NO. 2, 5, 7 TO 9 BY WAY OF SUBSTITUTE SERVICE
R-2 : Yathaluru Sankar Reddy, S/o Late Pedda Sidda Reddy,
R-5 : Yathaluru Vijayamanohar Reddy, S/o Late Ramakrishna Reddy,
R-7 : Y. Varalakshmi, D/o Late Pedda Sidda Reddy,
R-8 : Y. Lalitha, D/o Late Pedda Sidda Reddy,
R-9 : Y. Bharathi, D/o Late Pedda Sidda Reddy,
All the above Respondents No.2, 5, 7 to 9 are residents of Eguva Veedhi Village. Thondamanadu Post, Srikalahasthi Mandal, Tirupati District.
Take notice that, the above Appeal from the Judgment and Decree dt.01-05- 2024 in O.S.No.60 OF 2017, Civil Judge (Senior Division), Srikalahasthi filed by the Appellants against you and others which stands posted to 30-07-2025 for your appearance. Hence you are hereby required to appear before the above named Court on the aforesaid date at 10.30 a.m. onwards either in person or through an advocate and file your objections else, the matter will be decided as exparte.
Hearing Date: 30-07-2025
B.L. ABILASH,
ADVOCATE, THIRUPATHI

పథకాలు అమలులో తప్పిదాలు వుంటే చర్య

మండల వ్యవసాయాధికారి షణ్ముగం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో రైతులకు అందించే ప్రభుత్వ పథకాలు అమలులో ఎలాంటి తప్పిదాలకు చోటు చేసుకున్నా చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి షణ్ముగం అధికారులను హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రంలో కే రేవతి పల్లమాల, బిన్ కండ్రిగ, కాటూరు, వివిఎస్‌పురం పురం రైతు భరోసా కేంద్రాలకు ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ రైతు సేవా కేంద్రం కింద ఇండెంట్ పెట్టి ఈ నెల 24వ తేదీ బిన్ కండ్రిగ రైతు భరోసా కేంద్రానికి 400 బస్తాలు యూరియా తెప్పించామన్నారు. యూరియా లోడ్ వస్తుందని ఈ నాలుగు రైతు సేవా కేంద్రాలకు సన్న, చిన్న కారు, పెద్ద రైతులకు ఫోన్ ద్వారా తెలిపారన్నారు. విషయం తెలుసుకొన్న ఈ రైతు సేవా కేంద్రాలకు రైతులు గ్రూపులుగా ఏర్పడి గ్రూపు నుండి ఒకరో, ఇద్దరు రైతులను పంపి ట్రాక్టర్, ఆటో లేదా బైక్ ల ద్వారా వచ్చి డబ్బు చెల్లించి , ఎరువులను లారీ నుంచి తమ వాహనాల్లో వేసుకుని తీసుకు వెళ్లారన్నారు. ట్రాక్టర్ లాంటి వాటిలో 20 నుంచి, 30 బస్తాలు పంపడంతో అక్కడ ఉన్న రైతులు, ప్రజాప్రతినిధులు, అగ్రికల్చర్ అధికారికి ఫోను చేసి ఒక్క రైతుకు ఎక్కువ బస్తాలు ఇస్తున్నట్టు భావించి ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే ఏవో స్పందించి బుచ్చినాయుడు కండ్రిగ రైతు సేవా కేంద్రానికి చేరుకుని అప్పటికే లారీలో వున్న 295 బస్తాలును రైతు సేవా కేంద్రంలో దించి రైతులు తో మాట్లాడి ఉన్న బస్తాలతో ఎక్కువ అవసరమున్న రైతులకు సర్ది చెప్పి, అడిగిన వాటిలో అవసరాన్ని బట్టి తగ్గించి, ఈ దఫా కోటాలో తెప్పించి ఇస్తామని భరోసా ఇచ్చారు.

రైతులను ఒప్పించి, రైతు దగ్గర పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు వివరాలు తీసుకొని ఉన్న ఎరువును వీలైనంత ఎక్కువ మంది కి ఈ రైతు సేవా కేంద్రాల్లోనే కాకుండా పరిసర ప్రాంతాల నుండి వచ్చిన రైతులకు కూడా అందించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మనకు ఈ నెల అఖరకు ప్రతి రైతు సేవా కేంద్రానికి శాశ్వత ఉద్యోగులు వస్తారన్నారు. అప్పటి నుంచి ప్రతి పథకం వైతు సేవా కేంద్రం పరిధిలోనే అమలు చేస్తామని పేర్కొన్నారు. యూరియా పంపిణీలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని, మండల రైతులకే ఇచ్చామన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు సహకరించాలని కోరుతున్నామన్నారు. రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జులకు భవిష్యత్‌లో ఎరువుల పంపిణీలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకూడదని ఆలా జరిగితే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకొంటామని అగ్రికల్చర్ అధికారి షణ్ముగం హెచ్చరించారు.

గ్యాస్ సిలిండర్ పేలి షెడ్డు ధ్వంసం

రూ.40లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధిలోని బగళనత్తం గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి షెడ్డు ధ్వంసమైన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని లక్ష్మమ్మకు చెందిన షెడ్డును రామకుప్పంకు చెందిన అక్బర్‌కు ఒకటిన్నర సంవత్సర క్రితం బాడుగకు ఇచ్చారు. అతను షెడ్డులో సోఫాలు తయారు చేసి విక్రయించుకునేవాడు. కాగా మంగళవారం రాత్రి షెడ్డులోని గ్యాస్ సిలిండర్ పేలడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కుప్పం అగ్నిమాపక సిబ్బంది త్వరితగతిన వచ్చి మంటలు అదుపు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే అప్పటికే షెడ్డులోఉన్న సోఫాలు, పరుపులు, గృహాలకు కావలసిన ముడిసరుకులు తదితర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో సుమారు రూ.30 లక్షల వరకు నష్టం వచ్చిందని, షెడ్డుకు రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.

రాతి బండ పడి యువకుడు మృతి

ప్రజాశక్తి- కుప్పం రూరల్:

కుప్పం పట్టణం వడ్డేపల్లి ప్రాంతంలో చోటు చేసుకున్న ప్రమాదంలో యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన బుధవారం స్థానికంగా కలవరం లేపింది. వడ్డేపల్లి ప్రాంతంలోని రాళ్ల గంగమ్మ దేవాలయం ఎదురుగా గుట్టకు సంబంధించి రాతి పనులు జరుగుతున్నట్టు స్థానికులు తెలిపారు. ప్రమాదవశాత్తు రాతిబండ యువకుడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం క్షతగాత్రున్ని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం క్షతగాత్రుని తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఒకటవ, రెండవ పట్టణ సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ఒకటో పట్టణ సర్కిల్ కార్యాలయంలో పట్టణ, రూరల్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న సందర్భంలో ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, గూడూరు డిఎస్‌పి గీతా కుమారి సూచనల మేరకు ట్రాఫిక్ ను ఒకటో పట్టణం నుండి రెండో పట్టణానికి వెళ్లే ఆటోలను ఒకటవ రైల్వే వంతెన నుండి రెండవ పట్టణానికి వెళ్లాలని, రెండవ పట్టణం నుండి వచ్చే ఆటోలు రెండవ రైల్వే వంతెన ద్వారా పట్టణంలోకి ప్రవేశించాలని

ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న గూడూరు ఒన్, టు టౌన్ సిఐలు శేఖర్‌బాబు, శ్రీనివాసులు

అదేవిధంగా సాధుపేట నుండి వచ్చే ఆటోలు వాటర్ ట్యాంక్ మీదుగా పట్టణంలోకి రావచ్చని ఆటో డ్రైవర్లకు సూచించారు. రైల్వే స్టేషన్ నుండి సంఘం థియేటర్ వరకు రోడ్డు కిరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆటోలను నిలుపకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ స్థాయిలో 2025-2026 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయప్రవేశ పరీక్ష 2వ జాబితా ఫలితాల్లో విశ్వం విద్యార్థులు బీ సాత్విక, ఎన్ ఝాన్సీ రెడ్డి ఎంపిక అయ్యారు. వీరితో పాటు ఎం మహీధర్ రెడ్డి, ఎస్ హృతిక్ రాయల్, సలాడీ భువనేష్, ఎం నిహాంత్ కుమార్, డి మహీదర్, ఆర్ మనీషా, కే ముని రూపేష్, ఏ సంతోష్ పరాశర్, ఎన్ లాస్య చరిత, జే పూర్ణ సాయి రెడ్డి, రామ్ తేజ, హరిత, లోకేశ్వరి, భావన, కావ్య, విక్రమ్, గోపిక, జీవన్ సాయి రెడ్డి,శరత్ చంద్ర, నవదీప్ యాదవ్, జాహ్నవి, జస్వంత్, మిథున్ మిహాల్, నితీష్ సాయి, సోహిని, అభ్యుదయి, సోహిత్ తదితరులతో పాటు మొత్తం 57 మంది విశ్వం విద్యార్థులు సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ యన్ విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టరు విశ్వనాథ రెడ్డి , అకడమిక్ డైరెక్టర్ యన్ విశ్వ చందన్ రెడ్డి, కరస్పాండెంట్ యన్ తులసీ విశ్వనాథ్ లు విద్యార్థులను

నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు

అభినందించారు. ఈ సందర్భంగా విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా జాతియ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను విశ్వం విద్యార్థులు సాధిస్తునట్లు తెలిపారు. 2026 నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల కోసం 8688888802 / 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గూడూరుకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ చైతన్యయాత్ర

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జీవో నెంబర్ 4 ద్వారా పారా క్రీడాకారులకు ఎలాంటి పరీక్ష లేకుండా త్రీ పర్సెంట్ రిజర్వేషన్ తో గ్రూప్- 1 , గ్రూప్-2 పరీక్షలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్య యాత్ర బుధవారం గూడూరుకు చేరుకుంది. గూడూరు పట్టణ సమీపంలోని పోటు పాలెం జాతీయ రహదారి వద్ద పారా స్పోర్ట్స్ చైతన్య యాత్రకు గూడూరు పట్టణానికి చెందిన పారా క్రీడాకారుడు పురుషోత్తం వారి బృందం స్వాగతం పలికారు. పారా క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారుడు పురుషోత్తం మాట్లాడుతూ పారాక్రీడాకారులకు ఎన్నిక లకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జాతీయస్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తోందని జీవో నెంబర్ 4 ద్వారా ఎలాంటి పరీక్షలు లేకుండా పారా క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు ఏర్పాటు చేసిందని, పారా క్రీడాకారులు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. పారా క్రీడాకారుల సంక్షేమ కోసం కృషి చేసిన కానుగుంట్ల కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామస్వామి ,శ్రీనివాస్ గౌడ్ ,మల్యాద్రి నాయుడు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గూడూరుకు చేరుకున్న పారా స్పోర్ట్స్ అసోసియేషన్ చైతన్యయాత్ర

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలోని శ్రీ మీనాక్షి దేవి సమేత సోమేశ్వరాలయంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. శివపార్వతులకు విశేషాలంకరణ, అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు భక్తులు స్వామి అమ్మవారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు .

ఎమర్జెన్సీపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

దేశంలో 1975లో విధించిన అత్యవసర పరిస్థితి ఒక చీకటి అధ్యాయం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ 1975లో ఎమర్జెన్సీ విధించినప్పుడు అప్పటి ప్రజల పౌర హక్కులు రద్దయ్యాయని, పత్రికలపై సెన్సార్షిప్‌ను విధించారని, బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారని, దేశవ్యాప్తంగా సుమారు ఒక లక్ష యాభై వేల మంది విపక్ష నాయకులను, ప్రజలను జైల్లో పెట్టారన్నారు. అప్పటి కాలం మన దేశ ప్రజాస్వామ్యానికి చీకటి రోజులు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె శ్రీనివాసులు, బాబురావు, డాక్టర్ పి సుజన, సావిత్రి, డాక్టర్ ఏ దేవకి, డాక్టర్ జె కోటేశ్వరరావు అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరులో అవగాహన కలిగిస్తున్న అధ్యాపకులు

గూడూరు టౌన్ : స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, డిపార్టుమెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివ ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తమమైన పరిపాలన విధానానికి మన రాజ్యాంగం పెద్దపీట వేసిందని అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ప్రకారం 1975లో విధించిన జాతీయ అత్యవస పరిస్థితి ప్రజల హక్కులను హరించి వేసిందని కొంతమంది మేధావులను సైతం అసంతృప్తికి గురి చేసిందని తెలిపారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు కే. రవిరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి విజయ మహేష్ మాట్లాడుతూ 1975 జూన్ 25 జాతీయ అత్యవసర పరిస్థితి ఏర్పడడానికి గల కారణాలు, దాని వల్ల కలిగిన పరిణామాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. నారాయణరాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పీర్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ శర్మ, కిరణ్మయి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ శైలజ, భీమవరపు లక్ష్మి, కృపా కరుణ వాణి, హిమబిందు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.